# గనులు, ఓసీపీల్లో మరింత రక్షణ చర్యలు చేపట్టాలి

- ఎల్లో, రెడ్ కార్డు విధానం రద్దుచేయాలి
- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య
- సింగరేణి భవన్‌లో సేఫ్టీ ట్రైపార్టియేట్ సమావేశం

శ్రీరాంపూర్, జూలై 19 : సింగరేణిలోని గనులు, ఓసీపీల్లో ప్రమాదాలు జరుగకుండా యాజమాన్యం మరింత రక్షణ చర్యలు చేట్టాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్ బలరాం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సేఫ్టీ ట్రైపార్టియేట్ సమావేశంలో సీతారామయ్య పాల్గొని మాట్లాడారు. ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాజమాన్యం అమలు చేయాలని చూస్తున్న ఎల్లో, రెడ్ కార్డు విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గనులు, ఓసీపీల్లో అధికారుల నిర్లక్ష్య విధానాలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్కే-8 కాలనీ డిస్పెన్సరీని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలన్నారు. ప్రమాదాలు నివారించేందుకు కార్మికుల సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. సూపర్‌వైజర్లు, ఎలక్ట్రీషియన్లకు సేఫ్టీపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌డీఎల్ ఆపరేటర్లకు డంపర్ సీట్లు ఏర్పాటు చేయాలని, మెరుగైన వైద్యం కోసం కార్మికులను కార్పొరేట్ దవాఖానలకు పంపించాలని వెల్లడించారు. ప్రమాదాలకు కేవలం సూపర్‌వైజర్లను బాధ్యులను చేయరాదన్నారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణకు స్పెషల్ డ్రైవ్ కింద వైద్య పరీక్షలు నిర్వహించాలని ఏరియా దవాఖానల్లో అన్ని విధాలా వైద్య సదుపయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ సూపర్‌వైజర్లను భర్తీ చేయాలని కోరారు. గోదావరిఖని ఓసీపీలో జరిగిన ప్రమాదానికి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిని యథావిధిగా కొనసాగించాలని, వెంటనే అనుమతులు తెప్పించాలన్నారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, మిర్యాల రంగయ్య, వైవీ రావు, వంగ వెంకటి, ఎల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 19 : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదల కారణంగా విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు పడిపోవడం, రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడం ఇతరత్రా సమస్యలపై ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, సౌకర్యాల నిర్వహణను పర్యవేక్షించాలని సూచించారు. మురుగు కాలువలను శుభ్రం చేయిస్తూ, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మండల పరిషత్, పంచాయతీ అధికారులు, కార్యదర్శులు విధులపై అప్రమత్తంగా ఉండాలని, తమ పరిధిలో పరిష్కారంకాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలాల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

## 'సమస్యలపై ఉద్యమం'

తాండూర్, జూలై 19 : మండలంలోని స్థానిక సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ తీసుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి తెలిపారు. స్థానిక సురభి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేవం నిర్వహించారు. మండలంలోని సమస్యలు పరిష్కరించాలని డ్రైనేజీ, వీధిదీపాలు, కార్మికుల వేతనాలు, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, అండర్ బ్రిడ్జీల్లో నీరు నిల్వ, బుధవారం సంతలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం, మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ అందించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని, అర్హులైన పేదవారికి ప్రభుత్వ భూములు ఇవ్వాలని మండల కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, సీనియర్ నాయకులు తుకారం, సిద్ధం మల్లేశ్, మండల ఉపాధ్యక్షుడు పుట్ట కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, మండలాధ్యక్షుడు మామిడి విగ్నేశ్, నాయకులు తుపాకుల చంద్రయ్య, నాగభూషణ్, దుర్గాచరణ్, ఏమూర్ల ప్రవీణ్, కోటి నరేశ్, పుప్పాల మహేశ్, శంకర్, రమేశ్, ఎండీ వసీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

మందమర్రి, జూలై 19 : సింగరేణి బొగ్గు గనులు, విభాగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు గనులు, విభాగాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని హెచ్ఎంఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో 3 వేల మంది పర్మినెంట్, 7వేల మంది కాంట్రాక్టు మహిళా కార్మికులు పని చేస్తున్నారన్నారు. గుర్తింపు సంఘంతో పాటు, యాజమాన్యం మహిళలను చిన్నచూపు చూస్తూ, వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మహిళలు ఆత్మ గౌరవంతో మెలిగేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యానిదేనన్నారు. సరైన సదుపాయాలు లేక మహిళా కార్మికులు వేధింపులకు గురవుతూ, ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. మహిళా కార్మికులకు మహిళనే సూపర్‌వైజర్‌గా నియమించాలని, అలాగే గనులు, విభాగాలపై ప్రత్యేకంగా విశ్రాంతి గదులు, ప్రత్యేక క్యాంటీన్లు, మూత్రశాలలు, డ్రెస్సింగ్ రూములను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు జక్కుల నారాయణ, ఉపాధ్యక్షుడు జక్కిన బోయిన శ్రీనివాస్, కేంద్ర నాయకులు వెల్ది సుదర్శన్, బోనాల శ్రీనివాస్, చొప్పరి రామస్వామి, థామస్, ముఖేశ్, జెల్లి రజేశ్ పాల్గొన్నారు.

## ఎకరానికి రూ. 50 లక్షలు ఇవ్వాలి

కలెక్టర్‌కు ఎన్‌హెచ్ బాధితుల వినతి


కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితులు

నస్పూర్, జూలై 19 : నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో తమ భూములు కోల్పోయి వీధిన పడ్డామని, ఎకరానికి రూ. 50 లక్షలు ఇవ్వాలని జైపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాల కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. బాధితులు మాట్లాడు తూ ఇందారం ఓసీపీలో భూములు కోల్పోయిన వారికి రూ. 24.60 లక్షలు ఇచ్చారని, తమకు ఎకరానికి రూ. 8 లక్షలు ఇవ్వడం అ న్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో బాధితు లు సుందిళ్ల మల్లేశ్, ఇప్పలపల్లి బాపు, జనార్దన్‌రెడ్డి, రామారావు, తిరుపతి పాల్గొన్నారు.

## క్వార్టర్ సీస కోసం..

శ్రీరాంపూర్, జూలై 19 : మహారాష్ట్రకు చెందిన ఓ దొంగ క్వార్టర్ మద్యం కోసం వైన్స్‌లో దొంగతనానికి పాల్పడ్డాడు. ఏకంగా పైకప్పు రేకులు పగులగొట్టి, లోపలికి ప్రవేశించాడు. ర్యాకుల్లో పెద్ద సంఖ్యలో మద్యం సీసాలు, లాకర్‌లో డబ్బు ఉన్నా.. వాటిని ముట్టుకోలేదు. కేవలం ఒక క్వార్టర్ మద్యం సీసాను మాత్రమే తీసుకెళ్లాడు. కాగా, యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల్లో దొంగతనం తీరును పరిశీలించి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


సీసీ కెమెరాలో రికార్డైన దొంతనం

## వైద్య శిబిరం

పెంచికల్‌పేట్, జూలై 19 : మండలంలోని కమార్గాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారి ఆర్శిన్ వైద్య శిబిరం నిర్వహించారు. 96 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వేడి భోజనం, గోరువెచ్చని నీరు తాగాలని ఆర్శిన్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అనర్తి హాల్దర్, హెచ్‌వీ విక్టోరియా, ఎల్‌టీ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఏఎన్ఎంలు లక్ష్మి, రాధ పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

దండేపల్లి, జూలై19 : దండేపల్లి మండలం లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీలాపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఎంఈవో రవీందర్ తెలిపారు. పాఠశాలలో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, సిబ్బందితో సమన్వయ లోపం, విద్యార్థుల దుస్తుల కుట్టు కూలీకి సంబంధించిన డబ్బు చెల్లించడంలో నిర్లక్ష్యం తదితర కారణాలతో సస్పెండ్ చేసినట్లు వివరించారు.

## డ్రగ్స్‌కు బానిసవద్దు

హాజీపూర్, జూలై 19 : గ్రామాల్లోని యువత డ్రగ్స్‌కు బానిసకావద్దని మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ సూచించారు. మండలంలోని పడ్తన్‌పల్లి యువతకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నేరాల నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐ వెంట హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ముగ్గురి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, జూలై 19 : దొంగతనం కేసులో మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన కలకుంట్ల ఖాజా, మొహమ్మద్ అబ్బాస్, కలకట్ల శివను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. పాతమంచిర్యాలలో గల ఐస్ ఫ్యాక్టరీ యజమాని చేతి రాజ నర్సయ్య.. ఈ నెల 17న తన ఫ్యాక్టరీకి తాళం వేసి ఊరికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వచ్చి, చూడగా గేటు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. 500 మీటర్ల కేబుల్ వైర్, 6 ఎలక్ట్రికల్ మోటర్లు, 2 మెర్సిబుల్ పైపులు (వాటి విలువ రూ.2.50లక్షలు) దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ, దర్యాపుత ప్రారంభించారు. శుక్రవారం ఐబీ చౌరస్తాలో వాహనాలు తనిఖీ నిర్వహించగా, దొంగలించిన సొత్తును ఖాజా, అబ్బాస్, శివ ఆటోలో తీసుకెళ్తుండగా ఎస్ఐ సురేశ్ తమ సిబ్బందితో పట్టుకున్నారు. వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించారు.

## నేరాల నియంత్రణకు సహకరించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 19 : నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ దందాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో పోలీస్, మీడియా సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు, పోలీసుల మధ్య వారధిగా ఉంటూ సమాచారాన్ని చేరవేయాలన్నారు. అనంతరం పలు సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్ ఐ అడ్మిన్ పెద్దన్న, డీసీఆర్బీ సీఐ రాణా ప్రతాప్, మీడియా ప్రతినిధులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

